

అమ్మయ్య
దెయ్యం
వదిలింది
వాలి హిరణ్మయీదేవి

"లక్ష్మీ! ఎందుకలా వర్షంలో తడుస్తూ గేటు దగ్గరే నిలబడ్డావ్. లోపలికి వచ్చెయ్" అంటూ పిలిచాడు రమణారావ్.

"ఆ... వస్తున్నాను. ఏవండీ... రోజా ఇంకా రాలేదండీ – భయంగా ఉంది"

"భయమెందుకు? ఏదో స్పెషల్ క్లాసుందని చెప్పిందిగా".

"ఆ... అవును గదూ – భయంలో – కంగార్లో మరిచేపోయాను. కానీ ఇంత పెద్దగా పడుతోన్న వర్షాన్ని చూస్తే మరింత భయం వేస్తోంది" వణుకుతూ అంది లక్ష్మి.

అంత చల్లటి వాతావరణంలోనూ చెమటతో నిండిన ఆమె ముఖాన్ని చూస్తూ 'లక్ష్మి – ఈ మధ్య నీకీ భయం చాలా ఎక్కువయిందేంటి? వర్షాకాలంలో వర్షాలుపడవా? దీనికీ భయపడితే ఎలా?" కాస్త విసుగ్గా అన్నాడు రమణారావ్.

"అదిగాదండీ... అది వచ్చే దారినిండా మాన్‌హోల్స్ ఉన్నాయిగదా... మన వీధిలోని బ్యాంక్‌లో పనిచేసే పారిజాతంగారు అందులోపడి చనిపోయారు గదా – అప్పట్నుండీ వర్షాలు పడుతున్నప్పుడల్లా గుండెలు అదిరిపోతూ ఉన్నాయ్".

"అబ్బ – వెధవ అపశకునపు మాటలు మాట్లాడకు... వర్షంవచ్చినపుడు వేరే రూట్లో రమ్మనమని ఎప్పుడో చెప్పాను" ఆమె భయాన్ని కొట్టిపారేయకుండా చెప్పాడు.

"కానీ..."

"మళ్లీ ఏంటి?"

"దానికా మాట గుర్తుందో లేదోనని" నసిగింది.

"నీలా దానికి మతిమరుపు లేదులేగానీ తేజా ఏడి?"

"అన్నట్లు వాడూ బజార్‌కి వెళ్లాడుగదా – రెయిన్ కోట్ తీసుకెళ్ళమన్నా తీసుకెళ్లలేదు – తడిసిపోతాడో ఏంటో – అసలే ఇప్పుడెక్కడ చూసినా చికెన్ డెంగ్యూలని – మంకీ డెంగ్యూలనీ కొత్తకొత్త జబ్బులు వస్తున్నాయి. వీడికేదన్నా వస్తే ముందే తొందరగా తగ్గదు – వాడేమందులూ వాడడాయే – ఎలా?" ఆదుర్దాపడుతూ అంది లక్ష్మి.

"అబ్బబ్బ. ఆపు లక్ష్మీ. వాడేం చంటిపిల్లాడా? తడవకూడదని తెలీదా ఏం?"

"మొన్న టీవీలో చూపించారు – అదేదో – కొత్తజబ్బులొచ్చి మనుషులు ఎలా విలవిలలాడుతున్నారో"

"అబ్బబ్బ – ఆ టీవీని తీసి అటకమీద పారేస్తా – సగం భయాలు తగ్గుతాయ్ నీకు"

"ఆ... ఆ... పారేయండి. ఇవాళ టీవీని పారేస్తానన్నారు... రేపు నన్నూ పారేస్తానంటారు" గొంతు జీరపోతూండగా అంది లక్ష్మి.

"అబ్బ – ఏమన్నా అంటే ఈ ఏడ్పొకటి... నీళ్లకుండ తలమీదే ఉంటుంది. నాకేమో ఆడదాని కన్నీరు ఇంటికి అరిష్టమన్న నమ్మకం... అందుకే ప్రతి విషయానికీ నీతో కాంప్రమైజ్ అవుతూంటే నీ ధోరణిలో మార్పు అనేది రావటం లేదు" చికాగ్గా అన్నాడు. అంతలోనే వచ్చిన రోజాని చూసి గబగబా ఎదురెళ్లింది లక్ష్మి.

ఆదివారంనాడు ఓ రెండుమూడు గంటలపాటు తోటపని చేయడం అలవాటు రమణారావ్‌కి. ఆ టైమ్‌లోనే అతడు కాస్త ఉల్లాసంగా ఉంటాడు. తండ్రిని కాకాపట్టాలంటే అతన్తోపాటు ఆ తోటపని చేస్తే చాలు... అపరబోళాశంకరుడిలా ఎవరేం అడిగితే అదివ్వడానికి సిద్ధపడతాడు. ఆ సంగతి బాగా తెలిసిన అతని పిల్లలు ఆ టెక్నిక్ ఉపయోగించి వారి వారి అవసరాల్ని

అతని ముందుంచుతారు.

లక్ష్మికీ ఆ సంగతి కొంత అనుభవమే అయినా ఆదివారం రోజంతా కూర్చుని టీవీ చూడటం ఆమెకిష్టం. ఎందుకంటే ప్రతిరోజూ భర్తనీ - పిల్లలనూ పంపించే దాకా హడావుడి - ఆమె పని ముగించుకొని వచ్చేసరికి కరెంట్ తీసేస్తారు ఆ ఏరియాలో - పదకొండు నుండి రెండు గంటల వరకూ. రెండు గంటలకు టీవీ ముందు కూర్చోవాలంటే అప్పుడు ఆమెకి నిద్ర వస్తూంటుంది. ఒక్కోసారి నిద్రనాపుకొని చూస్తుంది - ఐదు గంటల వరకు. ఆ తర్వాత వంట - పిల్లలొస్తే వాళ్ళక్కావలసింది చేయడం.. వాటితో పదవుతుంది. పది నుంచి తేజాలోనో విజన్‌లోనో వచ్చే తెలుగు సిన్మాలు చూస్తుంది. హిందీ ప్రోగ్రామ్స్ పట్ల మక్కువ చూపదు. కరెంట్‌లేని టైమ్‌లో వచ్చే ఎదురింటి పిన్నిగారితో హస్కు వేస్తుంది - ఆమేది చెప్పినా చెవులప్పగించి వింటుంది. చదివే అలవాటు తక్కువే. కొంచెం చదివినా తలనొప్పి వచ్చేస్తుందామెకి. దాంతో ఇంట్లో న్యూస్‌పేపర్‌ని తెప్పించినా, మ్యాగజైన్ ఉన్నా చదవదు.

ఆమె అలా టీవీ వీక్షణలో మునిగి ఉండటం చూసి, రోజా - తేజాలు గార్డెన్‌లోకి అడుగు పెట్టారు.

గార్డెనంటే మరీ పెద్దదేంకాదు... అక్కడో రెండు రూమ్‌లు వేయొచ్చు - కానీ భార్య మాట కాదని రమణారావ్ సాధించినదదొక్కటే - చిన్నప్పట్నుంచీ అతనికి తమ పల్లెటూర్లో ఉన్న ఇంటిలో ఉన్నట్లు - అంతకాకున్నా కొన్ని చెట్లు, మొక్కలూ పెంచాలన్న ఆశతో, కనీసం ఆదివారం ఒక్క రోజయినా ఒళ్లొంచి పనిచేస్తే వ్యాయామం చేసినట్లుంటుందన్న ఆశతో కాంక్రీట్‌వనం లాంటి ఆ ఏరియాలో అలా ఓ చిన్నితోటని మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు. ఆ దారిన వెళ్లే వారెవరన్నా ఓసారి ఆగి ముచ్చటగా ఉన్న ఆ ఇంటిని, చిన్న తోటనీ చూసిగానీ కదలరు.

"నాన్నా! ఈ పసుపుగులాబీ మొక్కని మా ఫ్రెండ్‌నడిగి తీసుకొచ్చాను - ఎక్కడ నాటమంటారు?" అడిగింది రోజా తండ్రి దగ్గరకొచ్చి. ఆ మొక్కని చూడగానే 'చాటంతో ముఖమయిందతనికి.

"ఉండు... ఇక్కడ గుంటతవ్వి పెడదాం" అంటూ గునపమందుకొన్నాడు.

"మీరెందుకు? నేను చేస్తాగా ఆ పని" అంటూ వచ్చాడు తేజా.

"నాన్నా మీతో మాట్లాడాలి మేం" సూటిగా చెప్పింది రోజా.

"ఏంటీ పాకెట్‌మనీ సరిపోవడంలేదా - పెంచాలా?" వెంటనే అడిగాడు రమణారావ్.

"అదేంకాదు" అన్నాడు తేజా.


"ఏంట్రోయ్ - ఎవరైనా అమ్మాయినిగానీ ప్రేమించావా ఏంటి?"

"అబ్బ - మీరూ అమ్మలాగే ఊహించకండి. మేమిద్దరం ఇంట్లో ఉండాలా వద్దా తేల్చిచెప్పండి" కోపంగా అంది రోజా.

"అదేంటి బంగారూ - నిన్ను అత్తారింటికి కూడా పంపొద్దని - ఇల్లరికం వచ్చే అబ్బాయి కోసం చూస్తున్న నాతో ఇలా మాట్లాడటం ఏమీ బాలేదు" నొచ్చుకుంటూ అన్నాడు రమణారావ్.

ఇక డైరెక్ట్‌గా విషయంలోకి వస్తూ తేజా అడిగాడు "నాన్నా! రోజురోజుకీ మితిమీరిపోతున్న అమ్మ చాదస్తానికి మేం ఎన్నాళ్లని బాధపడాలి?"

"సర్లే - రోలు వెళ్లి మద్దెలకు చెప్పినట్లుంది - నేనూ ఆ బాధితుడినేగా - రోజా! ఆ కలుపు గడ్డి ఈ మొక్కల్ని సరిగ్గా ఎదుగకుండా చేస్తోంది - దాన్నంతా పీకిపారెయ్" అన్నాడు తనూ ఆ




పని చేస్తూ.

"నాన్నా - ఇక్కడే కాదు - అమ్మలో పెరిగే ఈ కలుపు మొక్కల్లాంటి భయాల్ని, ఆందోళనల్నీ మీరు పీకిపారెయ్యకపోతే - మేమూ సరిగ్గా ఎదగలేం" ఆయనకలవాటైన ఆ తోటపని భాషలో చెప్పింది రోజా.

"మొన్న ఎంతో సీరియస్‌గా క్లాస్ జరుగుతోంటే అమ్మ దగ్గర్నుండి ఫోన్ వచ్చింది. క్లాసులు జరిగే టైమ్‌లో ఫోన్ చేయొద్దని ఎన్నిసార్లు చెప్పినా..."

"పాపం ఏదో మరిచిపోయి, అది చెప్పడానికి చేసుంటుంది".

"అదేంగాదు... 'ఒరేయ్ క్లాసులో ఉన్నావా? లేక నేనిప్పుడు చూస్తున్న టీవీ సీరియల్‌లోని కుర్రాడిలా ఏ అమ్మాయితోనైనా ఏ క్లబ్‌లోనో - పిక్నిక్‌లోనో ఉన్నావా?' అంటూ అడిగింది" తలపట్టుకుంటూ అన్నాడు తేజా.

"సర్లే - నేను దార్లో స్కూటీ మీద ఉండగా ఫోన్‌చేసింది - ఐదు నుంచి ఆరు వరకూ దార్లో ఉంటాను డ్రైవింగ్ చేస్తూ... మాట్లాడలేనని ఎన్నిసార్లో చెప్పినప్పటికీ... ఇక వెహికల్ పక్కకు తీసుకొని మాట్లాడాను... ఇంతకీ అంత అర్జంటుగా చేసి అడిగిందేమిటో తెలుసా?"

"ఏమని అడిగిందేమిటి" అనుమానంగా అడిగాడు రమణారావ్.

'మంచినీళ్ళు గంటకోసారి తాగమన్నాను - తాగుతున్నావా? లేదా?' అని తల పట్టుకొంటూ అంది రోజా - తల్లి మానసికారోగ్యం పట్ల పెరుగుతోన్న భయంతో.

"నాన్నా! మనం ఏదన్నా చేయాలి... అమ్మ ఇలా ప్రతి చిన్న విషయానికీ క్షణక్షణం భయపడుతూ - మనల్నిలా ఇబ్బందిపెడుతూంటే చాలా ఇదిగా ఉంది. సెల్ ఆఫ్‌లో ఉంచుదామా అంటే మళ్లీ ఏదన్నా అర్జెంట్ విషయం ఉంటే ఎలా అన్న భయంతో ఊరుకొంటున్నాం" చెప్పాడు తేజా.

"ఆ పని మాత్రం చేయకండి - మొన్న మీటింగ్ ఉండి సెల్ ఆఫ్ చేసి ఉంచితే ఆటోలో

మా ఆఫీస్‌కొచ్చేసింది ఏమైందోనంటూ - ఆటో ఛార్జీలు వందయ్యాయి".

"ఇలాంటి పిచ్చిఖర్చులు బాగానే చేస్తుంది - తోట కోసం ఎరువులు, మందులూ కొనడానికి వంద ఖర్చయితే దుబారా చేసామంటుంది".

"మొన్నటికి మొన్న తలనొప్పి వస్తే ఏదో టాబ్లెట్ వేసుకొంటే - ఎక్స్‌పైరీ డేట్ చూడకుండా వేసుకొన్నానని గంట తిట్టింది. దాంతో తలనొప్పి మరింత ఎక్కువయింది".

"అబ్బా - మరీ అనకండిరా - ఆ చర్యల వెనుక దాగిఉన్న ప్రేమను గమనించరేంట్రా?"

"ఏ తల్లికి తన పిల్లల మీద ప్రేమ ఉండదని? ప్రతి చిన్న విషయానికీ ఇన్‌వాల్వ్ అవుతూంటే ఎలా? అమ్మకు జడిసి నాకెంతో ఇష్టమైన పానీపూరీని తినడం మానేసాను. ఆఖరికి ఎంత దాహమవుతున్నా ఫ్రూట్‌జ్యూస్‌లు, చెరకు రసం తాగడం మానుకొన్నా" అంది కోపంగా రోజా.

"పళ్లరసాలు ఆరోగ్యానికి మంచివనే 'కడుపునిండా తిన్నాను మొర్రో' అంటున్నా బలవంతంగా ఇస్తుంటుందిగా" ఆశ్చర్యంగా అన్నాడు రమణారావ్.

"పక్కింటి ఆంటీ వాళ్ల బంధువు చెరకురసం తాగి వాంతులు చేసుకొందట. ఆ మిషన్‌లో బల్లిపడిందని తర్వాత తెల్సిందట. ఆ మాట విన్నదగ్గర్నుండీ ఇలా... అయినా ఆ ఆంటీ వాళ్ళొచ్చిందగ్గర్నుండీ ఇలాంటివి చాలా పెరిగాయిలే. అదిగో కరెంట్ పోయిందిగా - ఇక ఆవిడిక్కడికి రావడమో, అమ్మ అటు వెళ్లడమో చేస్తుంది తప్ప - బాడీకి కాస్త ఎక్సర్‌సైజవుతుందనయినా ఇటొస్తుందేమో చూడు..." అంది రోజా.

మొన్న నారూమ్ అంతా నీట్ చేసింది ఆయాసపడుతూ... 'ఎందుకమ్మా నీట్‌గానే ఉంచుకొన్నాగా నా రూమ్' అంటే 'ఊరికినే సర్దాలే' అన్నది. కానీ అలా పిల్లల రూమ్స్‌ని అప్పుడప్పుడూ చెక్‌చేసి పిల్లలకేదయినా దురలవాట్లు అవుతున్నాయేమోనని చెక్‌చేస్తూ ఉండాలి అని ఆ పిన్నిగారు చెబితే సర్దినట్లు ఆ తర్వాత మాటల్లో తెలిసింది.

"ఏదో టైమ్‌పాస్ కాక టీవీ చూస్తూంటుందని, పిన్నిగారితోను, ఎదురింటి ఆంటీతోనూ మాట్లాడుతోందనుకొంటే... ఇలా తయారవుతోందేంటో సీరియస్‌గా ఆలోచించక తప్పదింక. అదుగో - మీఅమ్మ వస్తోంది... ఈ టాపిక్ కట్ చేయండి" అంటూ హెచ్చరించాడు రమణారావ్.

"ఇదిగో... తొందరగా ఆ పని ముగించుకొని ముగ్గురూ వచ్చి స్నానాలు చేసి తయారవ్వండి - అందరం సాయిబాబా గుడికి వెళ్లాలి. అక్కడికి దయానందస్వామి వారొస్తున్నారట" అంది లక్ష్మి.


"నేను రాను నాకసలే రేపు ఎగ్జామ్ ఉంది" అన్నాడు తేజా.

"నాకూ చదువుకోవలసింది ఉంది. నా బట్టలు కూడా ఐరన్ చేసుకోవాలి" అంది రోజా.

"నాకు ఆఫీస్ పని ఉంది లక్ష్మీ" అనేసాడు రమణారావ్.

"కుదరదు - అందరూ రావాల్సిందే. పాపం పిన్నిగారు మనకోసం శ్రమ తీసుకొని అపాయింట్‌మెంట్ ఇప్పించారు - వెళ్లాల్సిందే. మనింటిలో ఏదో ఒక గొడవ జరుగుతోంది - డబ్బు దుబారా అయిపోతోంది - వీటన్నిటికీ స్వాముల వారు పరిష్కారం చెబుతారు - త్వరగా తయారైతే అందరం నడిచి వెళ్లొచ్చు".

"అబ్బ నడిచెందుకు? వాళ్లిద్దరూ ఒక బైక్ మీద, మనమిద్దరం నా చేతక్ మీదా వెళ్లొస్తే సరి" అంటున్న రమణారావ్‌ని కొరకొరా చూశా




రు తేజా, రోజాలు.

"ఏమొద్దు – అక్సిడెంట్స్ ఎన్నో అవుతున్నాయ్ – శుభ్రంగా నడిచి వెళ్లొద్దాం".

"మనం నడిచివెళుతున్నా – ఏదన్నా వచ్చి గుద్దిపారేస్తేనో" అంది రోజా.

"ఛ... అన్నీ అపశకునం మాటలూ – నువ్వూనూ... అసలే ప్రొద్దుట దినఫలాల్లో వాహనాలతో జాగ్రత్త అవసరం అని చెప్పారు" అంది లక్ష్మి కూతుర్ని మరింత కోపంగా చూస్తూ.

"అదిగాదు లక్ష్మీ – పోయిన శనివారం అందర్నీ పస్తులుంచి అదేదో పూజచేసావ్‌గా! ఇప్పుడు మళ్లీ ఇక్కడికెళ్లడం అవసరమా?" దీనంగా అన్నాడు రమణారావ్.

"రామరామ ఉపవాసాల్ని పస్తులనొచ్చా? ఈ మధ్య డబ్బుకి కటకటగా ఉంటోంది. దోష నివారణకు స్వామీజీ ఏదన్నా చెబితే చేస్తే ఫలితం ఉంటుంది".

"ఆ... ఆ... ఉంటుంది – నాన్న జేబు నుండి మరో ఐదొందలు వదుల్తాయి ఈ పేరుతో" హేళనగా అన్నాడు తేజా. "అయినా అమ్మా – వారంవారం చేసే భజనలు చాలట్లేదా" అన్నాడు మళ్లీ.

"మీకంతా వేళాకోళమయిపోయింది. నేనేం చేసినా మనందరి మంచికోసం కాదా' గొంతు జీరపోతుండగా అంది లక్ష్మి.

రెండు చేతుల్నీ ఠక్కున జోడిస్తూ అన్నది రోజా "అవునమ్మా అన్నీ మా కోసమే చేస్తావ్ – చేస్తున్నావ్. కానీ ఒకటి గ్రహించడంలేదు – వాటివల్ల మరింత ఖర్చు పెరిగిపోతోందని... పోయిన్నెలలో ఆ గేటు అటువైపు గాదట ఇక్కడుండాలి – అంటూ మార్పించావు. అంతకు ముందు చక్కగా వెలుగొచ్చే కిటికీని మూయించి గోడ కట్టించావ్. ఈ పనులతో డబ్బు నీళ్లలా ఖర్చవుతోంది. ఇల్లంతా మట్టీ, సిమెంట్‌లతో రొచ్చుగా తయారవుతోంది. ఎవరేది చెబితే అలా చేస్తూపోవడమేనా? దీనికి అంతులేదా?"

విసురుగా ఇంట్లోకి వెడుతోన్న రోజాని చూస్తూ "చూసారా అదెలా అంటోందో... నేనింతలా పాకులాడేదేవరికోసమంట?" కన్నీళ్లు రాలుస్తూ అంది లక్ష్మి.

"అబ్బా... చిన్నపిల్ల ఏదో అంటే అలా ఏడుస్తావేం? ఊరుకో, వెళ్లి తయారవు. నేను పిల్లలకు నచ్చజెప్పి తీసుకొస్తాగా" ఎప్పటిలాగే భార్య ఏడుపుకి కరిగిపోతూ అన్నాడు రమణారావ్.

"హు" అంటూ వారిద్దరివంకా చూస్తూ - పెద్దపెద్ద అంగలతో లోపలికి వెళ్లాడు తేజా.

* * *

"ఏంటండీ అలా విచారంగా కూర్చున్నారు?" ఆదివారమైనా తోటపని చేయకుండా నెత్తిన చేతులు పెట్టుకొని కూర్చున్న రమణారావ్‌ని చూస్తూ అంది లక్ష్మి.

"ఏం లేదులే" పొడుగ్గా నిట్టూరుస్తూ అన్నాడు చేతిలోని పేపర్‌లో ఏవో కూడికలూ, తీసివేతలూ చేస్తూ.

"ఏదో ఉంది. నాదగ్గర కూడా రహస్యాలా? చెప్పండి ఏంటో".

"చెబితే ఆరుస్తావా -తీరుస్తావా?"కాస్త విసుగ్గా అన్నాడతను. ఎన్నడూ అలాంటి విసుగుదల భర్త నుంచి చూడని ఆమె గతుక్కుమన్నా - భార్యగా అతని బాధేంటో తెలుసుకోవాలనుకుంటూ "అసలు విషయం తెలిస్తేగా నేనేదైనా చేయడానికి" అంది నెమ్మదిగా.

"రవిగారినో పదివేలడిగాను. ఆరు పర్సెంట్ వడ్డీ చెబుతున్నారు. అందుకే కాబోలు వడ్డీలకు పదిగుర్రాలు చాల్లేదంటారు పెద్దలు" అన్నాడు.

"ఏంటీ? అప్పడిగారా?" ఎందుకు?" విస్తుబోతూ అడిగింది.

"అంతకు ముందు కరుణాకరం గారి దగ్గర తీసుకొన్న అప్పు తీర్చేందుకు".

"ఆయన దగ్గరెందుకు తీసుకోవలసి వచ్చింది" అయోమయంగా అడిగింది.

"ఏం చెప్పమంటావ్ లక్ష్మీ! నువ్వు చెప్పినప్పుడల్లా ఇంటికి మార్పులూ - చేర్పులూ చేయిస్తూంటే ఎంత ఖర్చు అవుతోందో తెలుసా? ఉన్న నలుగురికీ నాలుగు సెల్‌లు ఉండాలన్నావ్. వాటికెంతవుతోందో తెలుసా - నువ్ నీ వాళ్లతో - స్నేహితులలో చేసే పిచ్చాపాటికి - నెలకెన్ని కార్డులు వేయించాల్సి వస్తోందో తెల్సా... వారం వారం భజనేర్పాట్లు చేయించావ్ - ఏదో పూజకేలే అనుకొంటే - భజనకొచ్చే నీ భక్తజనం చూపిస్తున్న హస్తలాఘవం వల్ల రెండుసార్లు వాచీలు, రెండుసార్లు సెల్‌లు, మరోసారి నా గోల్డ్‌రింగ్ - మన బుల్లి ట్రాన్సిస్టర్ మాయమైతే మళ్లీ కొనాల్సివచ్చింది. అందుకే ఖర్చుల్ని తట్టుకోవటం కోసం, పార్ట్‌టైమ్ జాబ్ చేయాలనుకొంటున్నా..."

"పొద్దంతా కష్టపడి మళ్లీనా? పోనీ నేను చేయగలిగిందైతే నేను చేస్తాను. ఎలాగూ ఖాళీగానే ఉంటున్నాగా" అంది లక్ష్మి.


"పనివాళ్లు ప్యాక్ చేస్తే సూపర్‌వైజ్ చేయడమే. అంతే... కొన్నాళ్లు చేసిచూడు... నీకు మేం అన్ని పనుల్లో సాయం చేస్తాంలే" అన్నాడతను.

కూతురి పెళ్లి - కొడుకు చదువు ఖర్చులూ భూతాల్లా కన్పిస్తూంటే "సరే - కష్టమయినా చేస్తాను" అంది స్థిరనిశ్చయంతో.

* * *

"నాన్నా అమ్మని జాబ్‌లో చేర్పించడం, సెల్ ఫోన్‌ల వాడకాన్ని నిషేధించినందుకు రిజల్ట్ చాలా బాగుంది" అంది రోజా తండ్రితో.

ముఖ్యంగా పక్కింటి పిన్నిగారు వాళ్లకి ట్రాన్స్‌ఫర్ కావడం వల్ల కూడా అమ్మ దృక్పథంలో మార్పు వచ్చింది. బిజీ మూలంగా ముచ్చట్లకు, ఊసుకోలుమాటలకూ దూరమయింది. అదీగాక మనం తీసుకొచ్చిన నకిలీ బాబాతో మానవ ప్రయత్నంగా మనకు తోచింది మనం చేయాలని చెప్పడంతో ఠక్కున జాబ్ చేయడానికి ఒప్పుకుంది. అదీగాక ఏది ఎలా జరగాలని ఉంటే




అలా జరుగుతుంది. అని అతన్తో చెప్పించడం వల్ల లేనిపోని భయాలు తగ్గాయి" ఆనందంగా అన్నాడు తేజా.

"ఏ విషయాన్నీ అంత సీరియస్‌గా తీసుకోని మీరు అమ్మ విషయంలో మంచినిర్ణయం సరైనటైమ్‌లో తీసుకున్నారెలాగో" ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ అంది రోజా.

"ఎన్నో ఏళ్ల తర్వాత మొన్న నా చిన్ననాటి స్నేహితుడు కలిసాడు. అతడు తన గురించి, తన ఫ్యామిలీ గురించీ ఏవేవో చెప్పుకొచ్చాడు. చిత్రంగా అవన్నీ మనింట్లోవిలాగే ఉండడంతో, నాకు స్ఫురించిందొకటే" అన్నాడు రమణారావ్.

"ఏంటది? ఆసక్తిగా అడిగారు రోజా, తేజా.

"ఖాళీగా ఉండే బుర్ర దెయ్యాలకు నిలయమని. ఆ దెయ్యాలను వదలగొడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని. అందుకే అప్పులంటే అమితంగా భయపడే మీ అమ్మతో చాలా అప్పులయిపోతున్నాయని అబద్ధం చెప్పి, ఆమె తనంతట తానుగా జాబ్‌లో చేరేటట్లు చేసాను. దానివల్ల బిజీ షెడ్యూల్లోకి మారింది. కూపస్థమండూకంలా ఉండి, ఎవరేది చెబితే అది నమ్మే ఆమె, బైటప్రపంచంలోకి కాలుపెట్టడం వల్ల చాలా విషయాలు నేర్చుకుంది. ముఖ్యంగా కాలం విలువ - డబ్బు విలువా తెలిసొచ్చాయ్. ఆమె ఆలోచనాధోరణిలో మార్పులు వచ్చాయ్. క్షణక్షణం భయపడుతూ బతగ్గూడదని తెలుసుకొంది" అన్నాడు రమణారావ్.

"ముఖ్యంగా గమనించారా, అమ్మ కూడా ఈ మధ్య తోటపని చేస్తోంది. ఇంటికి కావలసిన కూరగాయల్లో - ఆకుకూరల్లో సగం మన పెరటినుండే వచ్చేలా చేస్తోంది. ఫ్రెష్ కూరల వల్ల కాబోలు ఈమధ్య మన కూరల రుచి పెరిగింది. ముఖ్యంగా అమ్మ స్థూలకాయం తగ్గి, ఆరోగ్యంగా తయారవుతోంది. ఇది అన్నిటికన్నా మంచి పరిణామం" అన్నాడు తేజా ఆనందంగా.

"మొత్తానికెలాగైతేనేం... మీ అమ్మని పట్టుకున్న దెయ్యాన్ని వదిలించగలిగాం" నవ్వుతూ అన్నాడు రమణారావ్.